# ఎక్కడి మానుష జన్మంబు

కనకదుర్గకి యిద్దరు కొడుకులు. ఇద్దరూ ఇంజనీర్లే! కనకదుర్గ భర్త కనకారావు పెద్ద ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశాడు! ఇద్దరు కొడుకులకీ చెరో యిల్లు కట్టించాడు. ప్రస్తుతం ఒక యిల్లు అద్దెకి ఇచ్చి, అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు.

రెండో కొడుక్కి యింకా పెళ్ళి కాలేదు. సంబంధాలు చూస్తున్నారు. "వీడికి కూడా పెళ్ళయిపోతే, ఆ రెండో యింట్లో వీడ్నీ భార్యనీ పెట్టేద్దాం. అన్నదమ్ములయినా ఒకేచోట ఉంటే గొడవలు రావచ్చు! ముందే విడి విడిగా ఉంటే మంచిది" అంది కనకదుర్గ తన భర్తతో.

"అలాగే! అసలు వీడికి ఏ పిల్లయినా నచ్చాలికదా! ఇప్పటికి చాలా సంబంధాలు చూశాం. ఏ ఒక్క పిల్లా నచ్చలేదు. వీడికి!" అన్నాడు కనకారావు

"మీరు చూసినది ఒకే ఒక్క సంబంధం! నన్ను చూసీ చూడగానే ఈ పిల్ల నాకు నచ్చేసింది నేను ఈ పిల్లనే చేసుకుంటాను అన్నారట! అందరూ నాలా అందంగా ఉంటారేమిటి" అంది, కనకదుర్గ.

"అందరూ నీలా ఉండరని, మన పెళ్ళయిన తర్వాత తెలిసింది నాకు, కానీ ఏం లాభం!"

"ఔనం! అన్నట్లు మీ ఫ్రెండ్ వాళ్ళమ్మాయి చదువు ఈ ఏడాదితో అయిపోతుందన్నారు కదా! అమె చదువు పూర్తవడానికి ఇక నాలుగు నెలలే వ్యవధి కదా. ఆ సంబంధం చూద్దాం!" అంది, కనకదుర్గ.

"అలాగే వాళ్ళది మంచి సంబంధం. పిల్ల కూడా బాగానే ఉంటుంది"

పెళ్ళిచూపులకి వెళ్ళారు. "నీకు వంట వార్పు వచ్చా!" అని అడిగింది కనకదుర్గ. అసలు వంట అంటే భలే మంట ఈ వనజ నామధేయం గల పెళ్ళికూతురుకి. "వంట వచ్చుగాని వార్పు రాదండి" అంది.

"అదేం సమాధానం!"

"నేను అబద్ధాలు ఆడనండి! ఈ రోజుల్లో అన్నీ కుక్కర్‌లోనే వండుతాం కదండీ! ఇక వార్పులేమీ ఉండవుకదా!" అంది వనజ.

ఈ సమాధానం విని తన మొగుడి కేసి చూసింది కనకదుర్గ.! "నీ రోగం కుదిరిందా" అని లోపల సంతోషిస్తూ, ముసిముసిగా నవ్వుతూన్న కనకారావు యిక ఎక్కువ నవ్వితే ఇంటికెళ్ళిన తర్వాత పీక నొక్కుతుందేమోనని, "వంటా వార్పు" "పెట్టే బేడా" "ఇంటా బయటా" యివ్వన్నీ జంట పదాలు వీటిని విడకొట్ట కూడదమ్మా, వనజా!" అన్నాడు.

"సారీ! అంకుల్ నాకు తెలీదు! ఇక పైన ఎప్పుడూ ఆ జంట పదాలు విడకొట్టకుండా

"అలూమగలులా" కలిపే ఉంచుతాను!" అంది వనజ.

"చెప్పగానే తన తప్పు ఒప్పేసుకుంది వినయంగల పిల్లే!" అనుకుంది కనకదుర్గ. వనజ యింజనీరింగ్ చదివింది పాపం! కనకదుర్గకి విద్య అబ్బలేదు, విద్యకి సంబంధించిన ప్రశ్నలు వెయ్యడానికి. కనకారావు కూడా పాతరోజుల్లో, బి.ఎ. (హిస్టరీస్) పాసయ్యాడు. అశోకుడు చెట్లు నాటించెను. బావులు తవ్వించెను మొదలగు విషయాలే తెలుసు అయనకి. పైగా తెలీని విషయాలు జోలికి పోయే రకం కాదు.

"టివీ చూస్తూంటావా! క్రికెట్ అంటే యిష్టమేనా, మేగజైన్స్ చదువుతుంటావా" అని రక రకాల చచ్చు ప్రశ్నలు వేసి పెళ్ళిచూపులు ముగించేశారు.

---

"పిల్ల తెల్లగా ఉంది పైగా గుండ్రటి మొహం, మనవాడు చూస్తే నలుపు కూడానూ అని భార్యాభర్తలు ఈ సంబంధమే ఖాయం చేద్దామని అనుకుంటూన్న సమయంలో, ఆ "మనవాడు" అనే మాట విని "పిలిచారా" అంటూ, జడకూడా చాలా పొడుగే అమ్మా!" అన్నాడు, తల్లిదండ్రుల దగ్గరకెళ్ళి విజయ్.

"నాన్నా! విజ్జీ వెర్రివాజమ్మా! శ్రీకృష్ణుడి భార్య సత్యభామకి కూడా జడ పొడుగే, కాని భర్తని, "తొలగంతోచే లతాంగి" అంది కనకదుర్గ.

చిన్నప్పట్నుంచీ ఇంగ్లీష్ మీడియంలో చదివిన విజయ్ "తొలగంతోచే" అంటే ఏమిటే అమ్మా అన్నాడు.

"కాలితో తన్నిందని అర్థం! అంచేత పెళ్ళయిన తర్వాత, "నీ జడా సత్యభామ జడ ఒకేలా ఉన్నాయ్ అన్నావనుకో, వనజ నిన్ను తన్నుతుంది జాగ్రత్త!" అంది.

"హమ్మయ్య! అయితే ఈ సంబంధమే ఖాయం చేస్తున్నారని గ్రహించి, "అమ్మో" అంటూ భయం నటిస్తూంది బయటికి వెళ్ళిపోయాడు విజయ్.

---

వనజా విజయ్‌ల పెళ్ళయిపోయింది. అద్దెకిచ్చిన ఆ రెండోయిల్లు ఖాళీ చేయించి, రెండో కొడుకు కాపరం అనుకున్నట్లుగానే విడిగా పెట్టించేశారు.

కొత్త కాపురం ముచ్చట్లు చూద్దామని, కనకదుర్గా కనకారావ్‌లు ఓ పదిరోజులు చిన్న కొడుకు యింట్లో ఉందామని వచ్చారు.

వంట వచ్చునని చెప్పిన వనజకి వంటరాదని తెలుసుకుని బాధపడ్డారు, అత్తమామలు.

తన కూతురికి వంట రాదన్న విషయం తెలిస్తే ఏమైనా గొడవలవుతాయోనని భయపడిన వనజ తండ్రి, కనకారావ్‌ని కనకదుర్గనీ, తనే రెండు యాత్రా స్పెషల్ టిక్కెట్లు కొనేసి కేదరనాథ్, బద్రీనాథ్ వరకూ తీసుకుపోయాడు.

"హమ్మయ్య" అంది వనజ విజయ్‌తో "హమ్మయ్య ఏమిటీ!" ఓ యిరవై రోజులలో మళ్ళీ వచ్చేస్తారు, వాళ్ళు!" అన్నాడు విజయ్.

"మీరేం కంగారు పడకండి పెళ్ళవక ముందు ఓసారి, టివీలో కొత్తరకాల వంటలు ఎలా చెయ్యాలో చెపుతూంటే చూసాను! వాళ్ళు వచ్చేసరికి నేర్చేసుకుంటాను.

"జాగ్రత్త! ఆ టివీలో ఎలా చేస్తున్నారో నువ్ కూడా అలాగే చేసి కొన్ని వంటలు నేర్చుకో!"

"మీకెందుకు! మీ అమ్మగారు వచ్చి, మా పెద్ద కోడలికి సిగచుట్టు కోవడం తప్ప ఏం రాదు! అనేటట్లు నేర్చేసుకుంటాను.

అటువంటి గొడవలు రావడం, నువ్వూ మా వదిన "సిగపట్లు" ప్రారంభించడం నాకు యిష్టం ఉండదు. మా వదిన ఓ దేవతే, చాలా మంచిది".

"అయితే నేను దెయ్యానినా!"

"అంటే నాతో "సిగపట్లా!"

"సిగపట్లు లాంటి పల్లెటూరి మాటలు ఆపెయ్యండి!"

"సర్లే! టివీలో వాళ్ళు ఎలా చేస్తే, నువ్ కూడా. అలాగే చేయ్!" అని విజయ్ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు.

---

టివీలో ఒక వంట ప్రోగ్రామ్ శ్రద్ధగా చూస్తోంది, వనజ.

టివీలో ఆరోజుకి వంట నేర్పేశారు. "మరి యిప్పుడు సరదాగా డ్యాన్స్ చేద్దాం!" అని డ్యాన్స్ మొదలెట్టారు.

పావం! వనజ భర్త మాట జవదాటదు. అతని టివీలో ఎలా చేస్తే అలా చెయ్యమన్నాడు కదా! తను కూడా డ్యాన్స్ మొదలెట్టింది. చీర కాలికి అడ్డం పడింది. అంతే! ధన్‌మని క్రింద పడింది కాలు విరిగింది! విజయ్‌ని వెంటనే రమ్మని ఫోన్ చేసింది.

పాపం ఆదరాబాదరా యింటికి వచ్చేసిన విజయ్, "వంట నేర్చుకునేటప్పుడు అసలు కాలు ఎందుకు విరిగిందే!" అన్నాడు.

"మీ వల్లనే!"

"నేను యింట్లో లేను, ఆఫీస్‌కి వెళ్ళిపోయాను కదే!"

"టివీలో ఎలా చేస్తే అలా చెయ్యమన్నారు కదా! వాళ్ళు వంట అయిపోగానే "సరదాగా డ్యాన్స్ మొదలు పెట్టారు". "నేనేమైనా తక్కువ తిన్నానా ఏమిటి! నేనూ చేశాను. చీర కుచ్చిళ్ళు కాలికి తగిలాయ్ పడిపోయాను. కాలు విరిగింది అంతే!" అంటూ కాలు విరగడం అంటే ఏదో మామూలు చిన్న విషయంలా చెప్పింది.

"వాళ్ళంతా డ్యాన్స్ చేయడంలో అనుభవజ్ఞుడవడం వలన వాళ్ళు కింద పడరు!"

అన్నాడు విజయ్.

"పెళ్ళయినప్పట్నుంచీ ఒక్క "చుడీదార్" కొనమని అడుగుతూనే ఉన్నాను! పెళ్ళయి కాపురానికి వచ్చిన తర్వాత, ఒక్క ముచ్చట తీరలేదు సరికదా కాలు విరిగింది. చుడీదార్ అయితే డ్యాన్స్‌కి వీలుగా ఉండేది.

"అయితే మొత్తం తప్పులన్నీ నావేనన్నమాట!" అన్నాడు, విజయ్.

హాస్పటల్‌లో ఓ పదిహేను రోజులు ఉండమన్నారు. విజయ్ తల్లిదండ్రులు మధ్యలో యాత్రలు విరమించుకుని, వియ్యాల వారితో, సహా వచ్చేశారు.

వివరాలు అన్నీ వినిన కనకదుర్గ, వంటలు నేర్చుకోమంటే, వార్పులు ఎలాగూ లేవని చెప్పి వంటలూ, డ్యాన్సులూ ఒకేసారి నేర్చేసు కుందామని, కాలు విరగ కొట్టుకుందన్నమాట! "పెళ్ళాం ఏ చెపుతే అన్నింటికీ గంగిరెద్దులా తలూపుతావ్" అంది కనకదుర్గ, తన కొడుకుతో.

మనస్సులోని బాధతో, "మా పెళ్ళయిన తర్వాత మా అమ్మ నాన్నా యాత్రలకి వెళ్ళిపోయారు కదా, పెళ్ళాం మాటకి నేను గంగిరెద్దులా తల ఊపాను అంటుందేమిటి మా అమ్మ" అన్నాడు, తన వదినగారితో.

"ఏం బాధపడకు ఈపైన మనమందరం కలిసి ఒకే యింట్లో ఉందాం! నీ భార్య అసలు వంట చెయ్యక్కర్లేదు, నేనే చేస్తాను. నేను సిగ ఎంత బాగా చుట్టుకోగలనో, వంట అంత బాగా చెయ్యగలను!" అంది వదిన గారు

"మధ్యలో ఈ సిగ ఊసేమిటి వదినా"

"ఏముంది నాయనా! నేను కాపరానికి వచ్చిన కొత్తలో మీ అమ్మగారు నేను సరిగ్గా వంట చెయ్యలేకపోతున్నానన్న ఉక్రోషంతో "నీకు సిగ చుట్టుకోవడం తప్ప ఏమీ రాదు!" అనేవారు. పౌరుషం వచ్చి, పుట్టింటికెళ్ళి ఓ నెలలో మా అమ్మదగ్గర అన్ని వంటలూ నేర్చుకుని వచ్చాను. అసలు ఆడదానిగా పుట్టకూడదయ్యా!" అంది వదినగారు.

"నా భార్య అనిన మాటలకీ, మా అమ్మ అనిన మాటలకీ, మగాడిగా పుట్టడమే తప్పని నేననుకుంటూంటే, నువ్వలా అంటావేమిటి వదినా!"

"అయితే సరే! అసలు మనిషిగా జన్మించడమే తప్పు అనుకుందాం సరేనా!" అంది వదినగారు.